ఎడిటర్ : రత్నం నాగరాజా
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్,జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగాం



ఉమ్మడి వరంగల్ జిల్లా
మంగళవారం 17,ఫిబ్రవరి, 2026

## వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా

# పాలకుర్తి సారంగపాణి

## వైస్ చైర్ పర్సన్ గా నేతావత్ శిభారాణి-రాజేందర్







1వ వార్డు కౌన్సిలర్
బెజ్జం పాపారావు



2వ వార్డు కౌన్సిలర్
బూక్యా జ్యోతి-నవీన్ నాయక్



3వ వార్డు కౌన్సిలర్
గుజ్జ వీరరాఘవరావు



4వ వార్డు కౌన్సిలర్
నునావత్ కమిలీ-కీమా



6వ వార్డు కౌన్సిలర్
మాలోత్ దేవేందర్



7వ వార్డు కౌన్సిలర్
తిరుపతి సురేశ్



9వ వార్డు కౌన్సిలర్
చిలువేరీ రమ



10వ వార్డు కౌన్సిలర్
తుమ్మల అరుణ



11వ వార్డు కౌన్సిలర్
సిలువేరు కుమారస్వామి



12వ వార్డు కౌన్సిలర్
తిరుపెల్లి వాణి

### ప్రశాంతంగా వర్ధన్నపేట మున్సిపల్ ప్రత్యేక సమావేశం
### సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన ప్రిసైడింగ్ అధికారులు
### వర్ధన్నపేట చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక

**వరంగల్ ప్రతినిధి,16 ఫిబ్రవరి, తరంగాలు** : వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట, మున్సిపాలిటీ ప్రత్యేక సమావేశం సోమవారం పూర్తయ్యాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, చైర్ పర్సన్/వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.వర్ధన్నపేట, పురపాలక సంఘం సమావేశానికి వరంగల్ ఆర్డీఓ సుమా ప్రిసైడింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఆయా పార్టీల వారీగా సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రిసైడింగ్ అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు.ఎక్స్ అఫీషియో సభ్యులుగా హోదా కలిగిన ఎమ్మెల్యే సైతం స్పెషల్ మీటింగ్ లకు హాజరై చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ఎన్నికలో పాల్గొన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శివకుమార్ నాయుడు ఎన్నిక ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపారు.మద్యాహ్నం 12.30 గంటలకు సరిపడా కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ నగర చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన పాలకుర్తి సారంగపాణి పేరును ఆ పార్టీకి చెందిన సభ్యుడు మాలోతు దేవేందర్ ప్రతిపాదించగా, బెజ్జం పాపయ్య బలపర్చారు. అలాగే, బిఆర్ఎస్ పార్టీ నుండి బి ఫామ్ సకాలంలో రానందు వల్ల బి ఆర్ ఎస్ తరఫున ఎన్నికల బరిలో నిలుచున్న చైర్మన్ అభ్యర్థిగా గుజ్జ వీరన్న పేరును స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తూ బానోతు జ్యోతి ప్రతిపాదించగా, చిలువేరు రమ బలపర్చారు.కాంగ్రేన్ పార్టీ నుంచి మాత్రమే విప్ జారీ చేయడం జరిగిందని, ఇతర పార్టీల నుంచి విప్ జారీ చేయబడలేదని ఈ సందర్భంగా ఆర్డీఓ సుమా పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ తరఫున చైర్పర్సన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పాలకుర్తి సారంగపాణి కి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన 5 గురు, స్వతంత్ర అభ్యర్థి గా గెలుపొందిన నేతావత్ షిబారాణి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు చెయ్యి ఎత్తు విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 7 గురి మద్దతు ఉండడంతో పాలకుర్తి సారంగపాణిని వర్ధన్నపేటపురపాలక సంఘం చైర్పర్సన్ గా ఎన్నికైనట్లు ఆర్డీఓ సుమా ప్రకటించారు.అలాగే బిఆర్ఎస్ నుంచి గెలుపొందిన 6 మంది సభ్యులుగుజ్జ వీరన్న కు మద్దతుగా చేతులెత్తే విధానం ద్వారా మద్దతు ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ గా స్వతంత్ర అభ్యర్థి నేతావత్ షిబారాణి పేరును కాంగ్రెస్ సభ్యులు నునావత్ కామ్లి ప్రతిపాదించగా, అదే పార్టీ



**చైర్మన్, వైస్ చైర్మన్ లకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్ సుధీర్ కుమార్**

అభ్యర్థి వాణి తిరుపల్లి బలపరిచారు. బిఆర్ఎస్ సభ్యుల తరఫున వైస్ చైర్మన్ అభ్యర్థిగా తిరుపతి సురేష్ కు అదే పార్టీ అభ్యర్థిని తుమ్మల అరుణ ప్రతిపాదించగా, బీఆర్ ఎస్ నుండి చిలువేరు కుమారస్వామి బలపరిచారు. స్వతంత్ర అభ్యర్థి షిబారాణి కు 6 గురు మంది కాంగ్రెస్ సభ్యులతోపాటు, ఎక్స్ అఫీషియో సభ్యులుగా చేతులెత్తే విధానంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు చేతులెత్తే విధానం ద్వారా ఓటు వేయడంతో మొత్తం కోరంకు కావలసిన 7 మంది మద్దతు ఉండడంతో నేతావత్ షిబారాణి ని వైస్ చైర్మన్ గా ఎన్నికైనట్లు ఆర్డీఓ సుమా ప్రకటించారు. అనంతరం చైర్పర్సన్ గా ఎన్నికైన సారంగపాణితో, వైస్ చైర్మన్ గా ఎన్నికైన నునావత్ షిబారాణి తో ఆర్డీఓ సుమా ప్రమాణ స్వీకారం చేయించారు.ఈసందర్భంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ కమిషనర్ సుధీర్ కుమార్ ప్రమాణ స్వీకారం చేసిన చైర్పర్సన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్ పర్సన్ నునావత్ షిబారాణి-రాజేందర్ తో పాటు కౌన్సిలర్లకు శాలువా కప్పి బొకే అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు.అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, క్షేత్రస్థాయిలో స్వీయ పర్యవేక్షణ జరుపుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ నడుమ పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నికల ప్రక్రియను జరిపించారు. చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ల ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తును ఏ.సీ.పీ లు నర్సయ్య , సీఐ శ్రీనివాసరావు, వర్ధన్నపేట ఎస్సైలు సాయిబాబు,రాజు, రాయపర్తి ఎస్సై ముత్యం రాజేందర్, జఫర్గడ్ ఎస్సై రామారావు,ఇతర పోలీసు అధికారులు పర్యవేక్షించారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం

మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్ పర్సన్ గా నేతావత్ శిభారాణి-రాజేందర్ ఎన్నిక

మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ భారీ విజయోత్సవ ర్యాలీ

చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట మున్సిపాలిటీ కైవసం చేసుకునే విధంగా కృషి చేసిన పార్టీ శ్రేణులు అందరికీ కృతజ్ఞతలు అభినందనలు తెలియజేసిన

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**వర్ధన్నపేట ప్రతినిధి,16 ఫిబ్రవరి, తరంగాలు :** వర్ధన్నపేట మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ అంతటా కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగురవేస్తూ, నినాదాలతో పట్టణం మార్మోగింది. ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని, ఇది పార్టీ శ్రేణుల కృషి, కార్యకర్తల త్యాగాల ఫలితమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, వర్ధన్నపేట పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామని తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. 6 వార్డులో ఘన విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేపట్టిన కౌన్సిలర్ శు భాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పార్టీ శ్రేణులకు, నాయకులకు, కార్యకర్తలకు, పట్టణ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన ప్రతి ఓటరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఎన్నికైన పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన నేతావాత్ శిభారాణిలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. కొంతమంది వ్యక్తులు వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడి అసత్య ప్రచారాలు నిర్వహించినా ప్రజలు వాటిని తిరస్కరించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం చేశామనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, తాము ఎప్పుడూ రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలోనే పనిచేస్తామని స్పష్టం చేశారు. పేద, బలహీన వర్గాల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. వర్ధన్నపేట కాంగ్రెస్ గెలుపులో కీలక పాత్ర పోషించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయూబ్లకు, అలాగే మండలాధ్యక్షులు, పట్టణ నాయకులు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వర్ధన్నపేట పట్టణ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అహర్నిశలు శ్రమించి వర్ధన్నపేటను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక, ప్రజాకేంద్రిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు.











# నర్సంపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా
# పెండెం శ్రీలక్ష్మి రామానంద్
# వైస్ చైర్‌పర్సన్‌గా గంధం నరేందర్

**వరంగల్ ప్రతినిధి,16 ఫిబ్రవరి, తరంగాలు** :నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. వరంగల్ జిల్లాలోని నర్సంపేట మున్సిపాలిటీ ప్రత్యేక సమావేశాలు సోమవారం పూర్తయ్యాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం,చైర్ పర్సన్/వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద మార్గనిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నర్సంపేట పురపాలక సంఘం సమావేశానికి నర్సంపేట ప్రిసైడింగ్ అధికారిగా ఉమారాణి బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11.00 గంటలకు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. మున్సిపల్ ఎన్నికల ఆథరైజ్డ్ అధికారి, నర్సంపేట ఆర్డీవో పోలం ఉమారాణి ఆధ్వర్యంలో, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ సుధీర్ కుమార్ సమక్షంలో గెలుపొందిన వార్డు సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చట్టం ప్రకారం చైర్‌పర్సన్,వైస్ చైర్‌పర్సన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి పాల్గొన్నారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా పెండెం శ్రీలక్ష్మి రామానంద్,వైస్ చైర్‌పర్సన్‌గా గంధం నరేందర్ ను ఏకగ్రీవంగా (కాంగ్రెస్ పార్టీ) ఎన్నుకున్నట్లు ఆథరైజ్డ్ అధికారి అధికారికంగా ప్రకటించారు.మొత్తం 30 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 21, బీఆర్ఎస్ 6, బీజేపీ 1, సీపీఎం 1, ఇండిపెండెంట్ 1 స్థానాలను గెలుచుకున్నాయి. వార్డు సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థులు శ్రీలక్ష్మి రామానంద్ చైర్‌పర్సన్‌గా, గంధం నరేందర్ వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చైర్ పర్సన్/ వైస్ చైర్ పర్సన్ ల ఎన్నికను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మున్సిపల్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తును ఇతర పోలీసు అధికారులు పర్యవేక్షించారు.

# కేసముద్రం తొలి చైర్ పర్సన్ బానోత్ సునీత ఎన్నిక

**బలరాం నాయక్ బలంతో కాంగ్రెస్ కి దక్కిన చైర్మన్ పీఠం.**
**కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు**



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఫిబ్రవరి.16, తరంగాలు :** నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీ ఎన్నికల్లో 16 వార్డులకు గాను అధికార కాంగ్రెస్ పార్టీ ఎనిమిది వార్డులు గెలుపొందగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎనిమిది స్థానాలు గెలిచాయి. సమన్యాయం ఉండడంతో చైర్మన్ పీఠం అధిరోహించడం కై ఉత్కంఠ గా నెలకొన్న నేపథ్యంలో, స్థానిక ఎంపీ పోరిక బలరాం నాయక్ కేసముద్రంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా తమ ఓటును వినియోగించుకోవడంతో చైర్ పర్సన్ కు మేజిక్ ఫిగర్ కాంగ్రెస్ పార్టీకి దకడంతో కాంగ్రెస్ పార్టీ నుండి రెండవ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన బానోత్ సునీత నూతన మున్సిపాలిటీకి చైర్పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా వైస్ చైర్మన్ గా అధికార పార్టీకి మెజార్టీ ఉండడంతో 13వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన డాక్టర్ అల్లం రమ వైస్ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీలో తమపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు ప్రజాపాలనే ధ్యేయంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ అండగా ఉంటామని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసముద్రం పట్టణాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. స్థానిక ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సీఎం కప్ రాష్ట్ర స్థాయి హాకీ,తైక్వాండో పోటీలకు మైనార్టీ విద్యార్థులు



**మహబూబాబాద్ ప్రతినిధి,ఫిబ్రవరి16, తరంగాలు:** సోమవారం కేసముద్రం జెడ్ పి ఎస్ ఎస్ హై స్కూల్ లో జరిగిన మహబూబాబాద్ జిల్లా స్థాయి సీఎం కప్ హాకీ పోటీలు నిర్వహించగా తెలంగాణ మైనార్టీరెసిడెన్షియల్ స్కూల్ మహబూబాబాద్ కు చెందిన ఎస్.కె అజ్మీత్ పాషా, ఎన్. యశ్వంత్, ఎస్.కె.ఉమర్ ఫారూఖ్, ఎస్.కె.బాష,వినయ్,డి. జశ్వంత్ అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి కి ఎంపికయ్యారని,అలాగే మహబూబాబాద్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో ఎస్.కె.సదాకత్ అలీ,ఎం.సాద్విక్,స్.హర్షిత్ పి.తనిష్క్ తేజ్,పి.కనిష్కతేజ్,మోయిన్, ఎస్.కె.సైఫ్ అలీ అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి లో జరిగే సీఎం కప్ ఎంపికయ్యారని స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్.జి.శ్రీనివాస రావు, పిఈటి నసీరుద్దీన్ లు ఒక ప్రకటనలో తెలిపారు,వీరు రాష్ట్ర స్థాయి లో మెడల్స్,సాధించి మైనార్టీ స్కూల్ కు, మహబూబాబాద్ జిల్లా కు మంచి పేరు తేవాలని ఆల్ ది బెస్ట్ తెలిపారు.వీరు రాష్ట్ర స్థాయి కి ఎంపికవడం పట్ల మహబూబాబాద్ జిల్లా యువజన క్రీడల అధికారి ఓ.జ్యోతి,మైనార్టీ స్టేట్ స్పోర్ట్సుఆఫీసర్ సోమేశ్వర్,వరంగల్ స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్,కోచ్ రాంబాబు,స్కూల్ స్టాఫ్ హర్షం వ్యక్తం చేశారు.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ



**జఫర్గడ్ ప్రతినిధి, ఫిబ్రవరి 16,(తరంగాలు):** లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉపవాస భక్తులకు మండలం తిమ్మంపేట గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తులకు ఉపసర్పంచ్ రాకేష్ సహాయంతోపండ్లు పంపిణీ కార్యక్రమం అదేవిధంగా తిమ్మంపేట గ్రామంలోని వీరాంజనేయ స్వామి భక్తులకు పండ్లు పంపిణీ అదేవిధంగా జఫర్గడ్ నీలకంఠ పరమేశ్వర దేవస్థానంలోని మహాశివరాత్రి ఉపవాస భక్తులకు పండ్లు పంపిణీ జఫర్గడ్ తిమ్మంపేట సర్పంచ్ ఉప సర్పంచ్ లు లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పూర్ణచందర్ మాట్లాడుతూ దేవాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ఉపవాస భక్తులకు పండ్లు పంపిణీ చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. లైన్స్ క్లబ్ ట్రెజరర్ మెరుగు బాలరాజు, స్టేషన్ఘన్పూర్ ట్రెజరర్ కోతి అశోక్, రేపూరి రమేష్, దాంశెట్టి సోమేశ్వర్,మాధ శ్రీధర్, సంతోష్ రాజు, బోనగిరి శ్రవణ్ కుమార్, శివప్రసాద్, గ్రామ గుడి పూజారులు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.



# ఘనంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్‌రావు జన్మదిన వేడుకలు



**కారేపల్లి టౌన్,తరంగాలు ,ఫిబ్రవరి 16:** ఎంపీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్‌రావు జన్మదిన వేడుకలు ఎంపీఓ రవీంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నరేందర్‌రావు ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందారని ప్రశంసించారు. ఆయన ఆయురారోగ్యాలతో, మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు ఈ వేడుకల్లో బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొల్ల రమేష్, భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, మండల నాయకులు ధరావత్ వినోద్, వాంకుడోత్ గాంధీ, సిటీ కేబుల్ రిపోర్టర్ సతీష్, బచలకూరి ఉపేందర్, ఎం.డి. మౌలాలితో పాటు ఎంపీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లకు శిక్షణ



**కేసముద్రం, ఫిబ్రవరి.16, తరంగాలు:** కేసముద్రం మండలంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన వార్డు మెంబర్లకు పంచాయతీరాజ్ ఆక్ట్ ప్రకారం నేటి నుండి ఈనెల 21వ తేదీ వరకు మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.క్రాంతి విలేకరులకు తెలిపారు. మొదటి విడతలో అర్పణపల్లి, భవాని గడ్డ తండ, భూక్యారంతండ, క్యాంపు తండా, చంద్రుతండా, ఇంటికన్నె, కల్వాల, కాట్రపల్లి, కోరుకొండ పల్లి, మహమూద్ పట్నం, సప్పిడి గుట్ట తండా, తౌర్య తండా, ఉప్పరపల్లి, వెంకటగిరిగ్రామపంచాయతీ వార్డు మెంబర్లకు ఉదయం 9:30 నుండి సాయంత్రం 6:30 వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని నూతనంగా ఎంపికైన వార్డు మెంబర్లు వినియోగించుకోవాలన్నారు.

# యువతను మత్తు నుండి దూరం చేయుటకు కబడ్డీ క్రీడలు

**రెండు రోజులపాటు కబడ్డీ క్రీడోత్సవాలు. విజేతలకు బహుమతుల ప్రధానం. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి.**







**తొర్రూర్ ,ఫిబ్రవరి 16, తరంగాలు:** సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా తొర్రూరు సేవాలాల్ శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి విజేతలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంచు సంతోష్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శోభయాత్ర కమిటీ కన్వీనర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఈనెల 14 15వ తేదీలలో స్థానిక జడ్పీ హైస్కూల్ గ్రౌండ్ లో రెండు రోజులపాటు దాతల సహకారంతోటి 600 మంది క్రీడాకారులను ఏకం చేసి పెద్ద ఎత్తున క్రీడలను విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. మొదటి బహుమతి దాత భూక్య శోభన్ బాబు ఫౌండేషన్ ద్వారా పదివేల రూపాయలను సేవాలాల్ కొత్తపల్లి జట్టు కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతి దాత సుంచు రామక్క సోమయ్య జ్ఞాపకార్థం 8000 రూపాయలను కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షులు సుంచు సంతోష్ ల చేతుల మీదుగా బ్రాహ్మణ కొత్తపల్లి జట్టు , తృతీయ బహుమతి కీర్తిశేషులు నాను నాయక్ జ్ఞాపకార్థం 6000 రూపాయలను అరుణ్ నాయక్ చేతుల మీదుగా ఎల్లంపేట జట్టు, చతుర్ధ బహుమతి అమర్ సింగ్ తండా సర్పంచ్ జాటోతు గంగా నరేష్ 5000 రూపాయలను నరేష్ వాగ్దేవి కాలేజీ జట్టుకు అందజేశారు. ఈ సందర్భంగా బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో సుంచు సంతోష్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, క్రీడలను జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని అన్నారు. ఓడిపోయిన జట్లు ఇంకా గట్టిగా ప్రయత్నించి గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు, ఆటలలో గెలుపు ఓటములు సహజమని వాటిని అధిగమించి ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు అదేవిధంగా గిరిజన జాతి ప్రముఖులు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సంఘం మాలోతు సోమేశ్వర్ నాయక్, బానోతు ప్రవీణ్ నాయక్, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, బాలాజీ నాయక్, సాయి నాయక్, సంతోష్ నాయక్ , దీకొండ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రగతి వైస్ చైర్మన్‌గా కాలం సునీత

**15 వార్డుల్లో 9 గెలిచి కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ**
**ప్రమాణ స్వీకారం అనంతరం పరోక్ష ఎన్నిక ప్రక్రియ పూర్తి**





**దోర్నకల్ అర్బ్,ఫిబ్రవరి 16, తరంగాలు** :మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పూర్తయింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా కాలం సునీత ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఈ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మరిపెడ మున్సిపాలిటీలోని మొత్తం 15 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 9 వార్డులను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. దీంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక కాంగ్రెస్‌కు లాంఛనప్రాయంగా మారింది. సమావేశం ప్రారంభంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు ముందుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పరోక్ష పద్ధతిలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీతలు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మరిపెడ పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మెజారిటీతో మరిపెడ మున్సిపాలిటీలో పాలన ప్రారంభం కావడంతో అభివృద్ధి పనులకు వేగం పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# తొర్రూరు మున్సిపాలిటీలో రాజకీయ రగడలు

**చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు వాయిదా**
**ఎంపీ ఓటు చెల్లదంటూ అభ్యంతరాలు -- వార్డు సభ్యత్వంపై పరస్పర ఫిర్యాదులు**
**మున్సిపాలిటీ వద్ద ఉద్రిక్త వాతావరణం**
**తొర్రూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక వాయిదా**





**తొర్రూర్, ఫిబ్రవరి 16, తరంగాలు:** తొర్రూరు పట్టణంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియ తీవ్ర వివాదాల నడుమ నిలిచిపోయింది. రాజకీయ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికార యంత్రాంగం జోక్యంతో సమావేశాన్ని నిలిపివేసి తదుపరి నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఈ ఎన్నికల ప్రక్రియలో కీలక మలుపు తిరిగింది. కడియం కావ్య ఓటు వేసిన చెల్లదని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎంపీగా ఉన్న వ్యక్తికి మున్సిపల్ ఎన్నికలలో ఓటు హక్కు ఉండదని వారు వాదిస్తూ, ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. నాలుగో వార్డు సభ్యుడిగా ఉన్న పేర్ల జంపన్న సభ్యత్వంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు ప్రతివాద ఫిర్యాదు సమర్పించారు. సభ్యత్వ అర్హతలు, ఎన్నికల చట్టబద్ధతపై పునఃపరిశీలన చేయాలని వారు కోరారు.

### పరస్పర ఆరోపణలతో సమావేశం ఉద్రిక్తం

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే రెండు పార్టీల నాయకులు న్యాయపరమైన అంశాలను లేవనెత్తడంతో వాగ్వాదం నెలకొంది. చట్టబద్ధతను పాటించకుండా ఎన్నికలు జరపాలని ప్రయత్నిస్తున్నారు అంటూ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించగా,ఓటమి భయంతోనే అనవసర అభ్యంతరాలు పెడుతున్నారు అంటూ కాంగ్రెస్ నాయకులు ప్రతిస్పందించారు. ఈ పరిణామాలతో సమావేశ మందిరంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, అధికారులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు కూడా అప్రమత్తంగా మోహరించారు.

### అధికారుల జోక్యం - ఎన్నికల వాయిదా నిర్ణయం

వివాదాస్పద అంశాలపై స్పష్టత వచ్చే వరకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని భావించిన ఎన్నికల అధికారి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఫిర్యాదులపై చట్టపరమైన అభిప్రాయం తీసుకుని, అర్హతలపై నివేదిక సిద్ధం చేసిన తర్వాతే కొత్త తేదీ ప్రకటిస్తామని తెలిపారు. ఈ పరిణామం తొర్రూరు పట్టణంలో రాజకీయ చర్చలకు దారి తీసింది. మున్సిపాలిటీ ఏర్పాటయ్యాక ఇదే మొదటిసారి చైర్మన్ ఎన్నికల ప్రక్రియ ఇంత తీవ్ర వివాదానికి దారి తీసిందని స్థానికులు పేర్కొంటున్నారు. పార్టీల మధ్య పెరిగిన రాజకీయ పోటీ కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ ఏకగ్రీవ ఎన్నిక

**మేయర్‌గా మూడ్ గణేష్ , డిప్యూటీ మేయర్‌గా సిరిపురపు లలితా కుమారి**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, తరంగాలు న్యూస్ ఫిబ్రవరి 16** : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మున్సిపల్ సాధారణ ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం, మేయర్--డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియలు చట్టబద్ధ నిబంధనల మేరకు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధ్యక్షత వహించి, ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.మొత్తం 60 డివిజన్లకు గాను ఎన్నికైన కార్పొరేటర్లలో సీపీఐకి చెందిన 22 మంది, కాంగ్రెస్‌కు చెందిన 22 మంది, బీజేపీకి చెందిన 1 మంది, సీపీఎంకు చెందిన 1 మంది, స్వతంత్రంగా గెలుపొందిన 6 మంది ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన 8 మంది కార్పొరేటర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు.అనంతరం జరిగిన మేయర్--డిప్యూటీ మేయర్ ఎన్నికలలో 20వ డివిజన్ సీపీఐ కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్‌గా, 8వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ సిరిపురపు లలిత కుమారి డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎక్స్-అఫీషియో సభ్యులుగా హాజరైన స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఖమ్మం పార్లమెంటు సభ్యులురామసహాయం రఘురాం రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించారు.ఈ సందర్భంగా నూతన మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ-కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సమాన అభివృద్ధి సాధించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టణంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల విస్తరణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఎక్స్-అఫీషియో సభ్యులు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్పొరేషన్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ ఎన్నికల ప్రక్రియను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమోయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఐడీఓసీ కార్యాలయం నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు. ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించబడినట్లు అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.